# ప్రవాహం

## శ్రీ. శ్రీ.

**కా**బట్టి శ్రీ శ్రీ కి స్థిరం లేదంటున్న వాళ్ళందరికీ నా కృతజ్ఞత. జీవించడం అంటే ప్రవహించడం కాబట్టి. నేను జీవిస్తున్నానన్న నిజాన్ని వాళ్లు గుర్తిస్తున్నారు కాబట్టి.

నిన్నగాక మొన్నదాకా వృక్షాల నిశ్చలత్వాన్ని మెచ్చుకుంటున్న నేను నేడు ప్రవాహం గురించి ప్రశంసించడం కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. అదే మరి స్థిరం లేకపోవడం అనవచ్చు. స్వవచనవ్యాఘాతం అనే దోషాన్ని నా మీద ఆరోపించవచ్చు. కాని చెట్లలోని నిశ్చలత్వాన్ని నేను ఆరాధించడం మానలేదే! నాకూ ఒకచోట స్థిరంగా ఉండాలనే ఉందే! ఏదీ నేను కోరుకునే నిశ్చలత్వం ?

బహుశా నాలో స్థిరత్వం లేకపోవడానికి అన్నిటికీ నేను 'ఔను' అనడమే కారణం కాబోలు? పన్నెండో ఏటికే పన్నెండు భాషలలో ప్రజ్ఞ సంపాదించిన జెనీ అనే అమ్మాయి ఒక్క భాషలో కూడా 'వద్దు' అనలేకపోయిందట. అడగనివాడిదే పాపంగా బదికి ఉండాలి పాపం జెన్నీ !

ఎన్నో సార్లనుకుంటాను 'వద్దు' అనాలని. ఒకమారు నేను 'నాకీ జీవితం వద్దు' అనేసి ఆ నిశ్చయాన్ని ఆచరణలో పెట్టబోయాను. కాని మనకి స్థిరం లేదుగా? మనస్సు మార్చుకున్నాను. ఇక మీద మృత్యువు దానంతట అదే రావాలి. అప్పుడు కూడా వద్దనడం నాకు చేతకాదు.

షరతులులేని ఒకే ఒక్క సరే నా జీవితం. ఇందులో కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి; కొన్ని సదుపాయాలూ ఉన్నాయి. 'సరే' అనడం అంత కష్టమైనదీ కాదు; అలాగని సులభమైనదీ కాదు.

సరే. ఒప్పుకున్నాం—ప్రవాహం ఎటు తీసుకుపోతే అటు పోవడానికి. దేన్నీ నిరోధించకూడదు. దేన్నీ నిరాకరించకూడదు: అయితే ఏమయినట్టు ?

కాకపోతే ఏమయినట్టు? ఒక ప్రశ్నకి జవాబుగా ఇంకో ప్రశ్న వెయ్యడం మంచిది. చాలా మంది ప్రశ్నకు జవాబు జవాబనుకుంటారు. ప్రశ్నకు జవాబు ప్రశ్ననిచేస్తే ప్రశ్నించినవాడిమీదనే జవాబిచ్చే బాధ్యత కూడా పడుతుంది.

ప్రస్తుతం ప్రశ్నించినవాడిని నేను కాబట్టి జవాబు కూడా నేనే ఇస్తాను.

ఏమయినట్టు? ప్రవహించడం మానేస్తాను. గడ్డ కట్టుకుపోవడానికి అనుమతిస్తాను. సమయానుకూలంగా సరే అని తాళంవెయ్యడమో, వీల్లేదని గద్దించడమో చేస్తాను. ఏపనులు చేస్తే మన ప్రతిష్ఠ ఇనుమడిస్తుందో అవే చేస్తాను. ఎవరితో కూడితే మనకి లాభించే తలుపులు తెరుచుకుంటాయో వాళ్లతోనే తిరుగుతాను. వాళ్ళ శత్రువులు నా శత్రువులే అని భ్రమపడడం కూడా ప్రారంభిస్తాను. ఎవడేనా నాదగ్గరకి వస్తే, వీడు ఎందుకు వచ్చాడు? వీడిని ఏమాత్రం వాడుకోవచ్చు? అనే పద్ధతుల మీద ఆలోచిస్తాను. సాలెపురుగులాగ గూడు కట్టుకొని ఏమక్షికమైనా పడదా అని ఎదురు చూస్తూ ఉంటాను.

ఇన్ని చేసినా జీవించడం ప్రవహించడం మానదు. నేను ప్రవహిస్తున్నానన్న నిజాన్ని గుర్తిస్తున్న వాళ్ళకి నా కృతజ్ఞత.


ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:  1907)

జారీచేసి చందావేయబడిన

| | |
|---|---|
| మూలధనం | రూ. 72,00,000 |
| అడిగిన మూలధనము. | రూ. 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,
కార్యదర్శి.

Source: Press Academy Website, Telugu Swatantra Magazine, Nov 1948

Disclaimer: This SELECTIVE topic/article/write-up of Sri Sri gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/